ప్రజాక్షేత్రం
PRAJA KSHETRAM
prajakshetram.in

అతి కొద్ది కాలంలోనే ఆదరణ పొందిన 'ప్రజాక్షేత్రం'
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని మండలాల వారిగా
నియోజకవర్గాల వారిగా, జిల్లాల వారిగా
రిపోర్టర్లు కావలెను
అనుభవం గలవారికి ప్రాధాన్యం ఇవ్వబడును
ప్రజాక్షేత్రం
కాల్ : 9177920459

సంపుటి - 01 | సంచిక : 273 | హైదరాబాద్ | మంగళవారం 18-02-2025 | పేజీలు - 6 | వెల.4/-

## అర్హులైన వారందరికీ

# రేషన్‌కార్డులు ఇవ్వండి

- కోడ్ లేని జిల్లాల్లో అర్హులకు వెంటనే రేషన్ కార్డులు జారీ చేయండి
- ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిశాక అన్ని జిల్లాల్లో..
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- కొత్త కార్డుల డిజైన్లను పరిశీలించిన సీఎం
- ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం
- కలెక్టర్లు, ఎస్పీలకు ముఖ్యమంత్రి ఆదేశం

రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో లేని జిల్లాల్లో అర్హులైన వారందరికీ వెంటనే రేషన్‌కార్డులు జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అ?ధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మిగిలిన అన్ని జిల్లాల్లో కొత్త కార్డులు ఇవ్వాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు.





# ఆలయాలకు ఆగమ స్వేచ్ఛ!


- వైదిక వ్యవహారాల్లో సర్కారు జోక్యం ఉండదు
- ప్రతి రాష్ట్ర రాజధానిలో శ్రీవారి ఆలయం!
- రూ.6 లక్షల కోట్ల 'ఆలయ ఆర్థికం'
- అర్చకుల వేతనాలు పెంచాం
- ఆలయాల అభివృద్ధికి రూ.138 కోట్లు ఖర్చు చేశాం
- గుళ్ల రక్షణకు ప్రత్యేక కమిటీ
- 'ఆలయాల సదస్సు'లో చంద్రబాబు
- ప్రపంచవ్యాప్తంగా 1,500కు పైగా పాలక కమిటీల ప్రతినిధుల రాక
- మహారాష్ట్ర, గోవా సీఎంలు కూడా
- ఇది వసుధైక కుటుంబ స్ఫూర్తి: ప్రధాని

ఆలయాల అభివృద్ధికి నిధుల కొరత లేదు. వాటిని వినియోగించి భక్తులకు సరైన వసతులు కల్పించడమే దేవుడికి సేవ చేసే ఉత్తమ మార్గం. ఏ ఆలయమైనా, ఏ ప్రభుత్వమైనా భక్తులు ఇచ్చే విరాళాలను వారి మనోభావాలకు అనుగుణంగానే ఖర్చుచేయాల్సి ఉంటుంది.
దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవేంకటేశ్వరుడి ఆలయం నిర్మించాలనేది నా ఆకాంక్ష. అలాగే హిందువులున్న ప్రతి దేశంలోనూ శ్రీవారి ఆలయం ఉండాలని ఆశిస్తున్నాను' అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

## రోడ్డుపై టేకాఫ్, ల్యాండింగ్ అయ్యే ఎయిర్ అంబులెన్స్

- ఐసీఏటీటీతో ఈప్లేన్ కంపెనీ 8,700 కోట్ల డీల్
- 788 వాహనాల సరఫరాకు ఒప్పందం
- త్వరలో దేశంలోని అన్ని జిల్లాల్లో మోహరింపు
- 2026 చివరికి సేవలు ప్రారంభమయ్యే చాన్స్!

మనిషి ప్రాణం చాలా విలువైనది! ప్రమాదానికి గురైన సమయంలో లేదా తీవ్ర అనారోగ్యం బారిన పడినప్పుడు వారిని సకాలంలో ఆస్పత్రులకు చేరవేయడంలో అంబులెన్స్‌లది కీలక పాత్ర!! అయితే పట్టణాలు, నగరాల్లో విపరీతంగా పెరిగిన ట్రాఫిక్ కారణంగా కొన్నిసార్లు అంబులెన్స్‌లు ఆ రద్దీలో చిక్కుకొని, ముందుకు వెళ్లేందుకు దారిలేక.. పలువురు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి.



# కొత్త సీఈసీగా జ్ఞానేశ్‌కుమార్

- ప్రధాని మోదీ, రాహుల్‌గాంధీ, అమిత్‌షాతోకూడిన ఉన్నతస్థాయి కమిటీ ఎంపిక.. రాష్ట్రపతికి సిఫారసు
- నూతన చట్టం ప్రకారం తొలి సీఈసీ నియామకమిదే
- ఆ చట్టంపై సుప్రీం తీర్పు వచ్చేదాకా ప్రక్రియను నిలిపివేయాలన్న కాంగ్రెస్
- ఈ భేటీనే జరిపి ఉండకూడదన్న రాహుల్
- జ్ఞానేశ్ స్థానంలో ఈసీగా వివేక్ జోషి

ప్రస్తుతం ఎన్నికల కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న జ్ఞానేశ్‌కుమార్.. భారతదేశ 26వ ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ)గా నియమితులయ్యారు. ఆయన స్థానంలో ఎన్నికల కమిషనర్‌గా.. ప్రస్తుతం హరియాణా సీఎసగా విధులు నిర్వర్తిస్తున్న వివేక్ జోషి (1989 బ్యాచ్ ఐఏఎస్ అధికారి) నియమితులయ్యారు. ప్రస్తుత సీఈసీ రాజీవ్ కుమార్ పదవీకాలం మంగళవారం ముగియనున్న నేపథ్యంలో.. తదుపరి సీఈసీని ఎంపిక చేసేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ సోమవారం భేటీ అయింది. ప్రధానమంత్రి కార్యాలయంలో



జరిగిన ఈ సమావేశానికి లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా హాజరయ్యారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ నేతృత్వంలోని సెర్చ్‌కమిటీ ప్రతిపాదించిన ఐదుగురు అభ్యర్థుల జాబితా నుంచి జ్ఞానేశ్‌కుమార్‌ను సీఈసీగా వారు ఎంపిక చేసి తమ నిర్ణయాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సిఫారసు చేసినట్టు కేంద్ర న్యాయశాఖ వెల్లడించింది.

# కృష్ణాజలాల్లో ఎపి ఏకపక్ష వినియోగంపై కేంద్రానికి ఫిర్యాదు

- కృష్ణాజలాల్లో వాటాల పంపిణీ, లెక్కింపు బాధ్యత కేంద్రానిదే తన
- వాటా మించి ఆంధ్రప్రదేశ్ ఎక్కువగా నీటిని తరలించకుండా చూసే బాధ్యత కూడా కేంద్రానిదే
- ఎక్కువ నీటిని తరలించకుండా ఎపిని టెలీమెట్రీతో అడ్డుకోవచ్చు
- రెండు రాష్ట్రాల నీటి లెక్కలకు టెలీమెట్రీనే పరిష్కారం
- టెలీమెట్రీకి అవసరమైన సగం నిధులు మనమే సమకూర్చుదాం
- వెంటనే టెలీమెట్రీ అమలు చర్యలు తీసుకోవాలి
- ఆ మేరకు కెఆర్ఎంబికి లేఖ రాయాలని ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జాకు సిఎం ఆదేశం
- ప్రాజెక్టుల కింద సాగవుతున్న పంటలకు ప్రణాళిక మేరకు నీరు విడుదల చేయాలని సూచన
- పంటలు ఎండిపోకుండా జాగ్రత్త పడాలని హితవు
- రాబోయే మూడు నెలలు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు హెచ్చరిక
- అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశాలు

శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి కృష్ణాజలాలను సద్వినియోగం చేసుకునే విషయంలో రాష్ట్ర యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఏకపక్షంగా ఏపీ ప్రభుత్వం నీటిని తరలింపు అంశంపై వెంటనే కేంద్రానికి ఫిర్యాదు చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని ఆయన ఆదేశించారు. నిర్ణీత కోటాకు మించి కృష్ణాజలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎక్కువ నీటిని తీసుకోకుండా నిరోధించాలన్నారు. నిర్ణీత వాటా కంటే ఏపీ ఎక్కువ నీటిని తరలించకుండా చూసే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని వ్యాఖ్యానించారు.

**వేసవి తీవ్రత అంచనాలతో..**

వచ్చే వేసవి తీవ్రతను బట్టి సాగు, తాగునీటి సరఫరాలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సాగునీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా క్షేత్రస్థాయి పర్యటనలతో పరిస్థితులను అంచనవేసి వాటికనుగుణంగా పరిష్కార మార్గాలను ఎంచుకోవాలని నిర్దేశించారు. సోమవారం రాష్ట్రంలో ప్రాజెక్టులలో నీటి నిల్వలు, పంటలకు సాగు నీటి విడుదల అంశాలపై సీఎం సంబంధిత



మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, చీఫ్ సెక్రెటరీ శాంతికుమారి, నీటిపారుదల సలహాదారులు ఆదిత్యనాద్‌దాస్, సీఎం ముఖ్యకార్యదర్శి మనిక్‌రాజ్ కన్నన్ తదితరులతో పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే మూడు నెలలు అత్యంత కీలకమని, రాష్ట్రమంతటా అన్ని చోట్ల సాగునీరు, తాగు నీరు. విద్యుత్తు డిమాండ్ గణనీయంగా పెరిగే అవకాశం ఉందని, నీటిపారుదల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# కారణజన్ముడు కెసిఆర్

- బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ జన్మదినోత్సవ వేడుకల్లో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్
- కెసిఆర్ అంటే ఒక వ్యక్తి కాదు.. 4కోట్ల మంది ప్రజల భావోద్వేగం : హరీశ్
- రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా వేడుకలు

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 71వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ సాధకుడుగా ప్రగతి ప్రదాతగా కారణజన్ముడైన తమ అభిమాన నేత తెలంగాణ కోసం చేసిన త్యాగాలను కృషిని స్మరించుకుంటూ పార్టీ నేతలు, అభిమానులు రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో జన్మదిన వే డుకలు జరుపుకున్నారు. అన్నీ జిల్లాల్లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాల వద్ద టపాసులు కాలుస్తూ, స్వీట్లు తినిపించుకుంటూ తమ అభిమాన నేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పుణ్య క్షేత్రాలకు వెళ్లి కెసిఆర్ పేరు మీద పూజలు చేయించారు. బిఆర్ఎస్ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో కెసిఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా 71 కేజీల కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించా రు. మాజీ మంత్రి, ఎంఎల్ఎ తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగి న ఈ వేడుకలకు



బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూధనాచారి, శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్ ముదిరాజ్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు మహమూద్ అలీ, వి.శ్రీనివాస్ గౌడ్, సత్యవతి రాథోడ్, పలువురు ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు,ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

టెలిమెట్రీ విధానమే పరిష్కారం

# అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు ఇవ్వండి

సోమవారం పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి పౌరసరఫరాల శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలో వచ్చిన అర్జీలు, కులగణనతోపాటు గ్రామసభలు, మీ సేవల్లో వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించే ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలన్నారు. అర్హులైన వారందరికీ కొత్త కార్డులు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. రేషన్‌కార్డుల కోసం ఇప్పటికే పలుమార్లు అవకాశం ఇచ్చినా మీసేవ కేంద్రాల వద్ద రద్దీ ఎందుకు ఉంటోందని అధికారులను ప్రశ్నించారు. అయితే దరఖాస్తు చేసిన కుటుంబాలే మళ్లీ చేసుకుంటున్నాయని, అందుకే రద్దీ ఉం టోందని అధికారులు చెప్పారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. దరఖాస్తు వచ్చిన వెంటనే కార్డులు జారీ చేసి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదన్నారు. ఇప్పటికైనా ఆలస్యం చేయకుండా వెంటనే కొత్త కార్డుల జారీకి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు మళ్లీ చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కొత్త కార్డులకు సంబంధించి పౌర సరఫరాల విభాగం రూపొందించిన పలు డిజైన్లను ముఖ్యమంత్రి పరిశీలించారు.

**ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం: రేవంత్**

రాష్ట్రంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతుండడంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్లు, ఎస్పీలు ఇసుక రీచ్‌లను తనిఖీ చేయాలని, ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఓవర్ లోడ్, అక్రమ రవాణాపై విజిలెన్స్ విభాగం దాడులు నిర్వహించాలని, అక్రమార్కులు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. కాగా, "ఇసుక రీచ్‌ల్లో ఇష్టారాజ్యం" శీర్షికన సోమవారం 'ఆగ్రా? ధజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.

# కొత్త సీఈసీగా జ్ఞానేశ్‌కుమార్

కేరళ క్యాడర్‌కు చెందిన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన జ్ఞానేశ్‌కుమార్ (61) గతంలో పలు కీలక శాఖల్లో సేవలందించారు. ఆర్టికల్ 370ని నిర్వీర్యం చేసే బిల్లు రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు. అయోధ్యలో రామమందిరం కేసుకు సంబంధించిన పత్రాల వ్యవహారాన్ని.. హోం శాఖలో అదనపు కార్యదర్శిగా ఆయనే పర్యవేక్షించారు. 'శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్' ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ, కేంద్ర సహకార శాఖల కార్యదర్శిగా పనిచేశారు. గత ఏడాది జనవరిలో ఆయన రిటైర్ అయ్యారు. సీఈసీ పదవిలో 2029 జనవరి 26 దాకా ఆయన కొనసాగనున్నారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించి.. 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ (అప్పాయింట్‌మెంట్ కండిషన్స్ ఆఫ్ సర్వీస్ అండ్ టర్మ్ ఆఫ్ ఆఫీస)చట్టం-2023' పేరుతో రూపొందించిన కొత్త చట్టం ప్రకారం సీఈసీ నియామకం ఇదే మొదటి సారి కావడం విశేషం.

**కాంగ్రెస్ అభ్యంతరం..**

పాత విధానం ప్రకారం.. ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తి కూడా సభ్యుడిగా ఉండేవారు. అయితే, 2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టంలో.. భారత ప్రధాన న్యాయమూర్తికి బదులు కేంద్ర మంత్రివర్గం నామినేట్ చేసే మంత్రికి స్థానం కల్పించింది (దాని ప్రకారమే ఇప్పుడు కేంద్ర మంత్రివర్గం తరఫున కేంద్రమంత్రి అమిత్ షా ఉన్నత స్థాయి కమిటీలో సభ్యుడిగా హాజరయ్యారు). దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై తీర్పు వచ్చే దాకా కొత్త చట్టం ప్రకారం నూతన సీఈసీ నియామకాన్ని వాయిదా వేయాలని కాంగ్రెస్ అభ్యంతరం తెలిపింది. ఉన్నతస్థాయి కమిటీ సమావేశానికి హాజరైన రాహుల్‌గాంధీ సైతం.. అసలు ఈ భేటీనే జరిపి ఉండకూడదంటూ తన అసమ్మతిని లిఖిత పూర్వకంగా తెలిపారు. ఆ పిటిషన్లపై సుప్రీంలో బుధవారమే విచారణ జరగనున్న విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తుచేశారు.

**రాజీవ్‌కుమార్‌కు వీడ్కోలు**

ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా రాజీవ్ కుమార్ పదవీకాలం మంగళవారంతో ముగియనున్న నేపథ్యంలో.. కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ఆయనకు వీడ్కోలు పలికింది. రాజీవ్ కుమార్ 2020 సెప్టెంబరు 1న కేంద్ర ఎన్నికల సంఘంలో ఎన్నికల కమిషనర్‌గా చేరారు. 2022 మే 15న దేశ 25వ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కమిషన్‌లో 4.5 సంవత్సరాల పాటు సాగిన ఆయన పదవీ కాలంలో అనేక సంస్కరణలు జరిగాయి. కాగా.. ఎన్నికల ఫలితాలను అంగీకరించలేని పార్టీలు.. ఎన్నికల కమిషన్‌ను బలిపశువును చేస్తున్నాయని వీడ్కోలు కార్యక్రమంలో రాజీవ్‌కుమార్ వ్యాఖ్యానించారు. ఎన్నికల అధికారులను లక్ష్యంగా చేసుకుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోందని ఆయన పేర్కొన్నారు. అత్యంత పారదర్శకంగా జరిగే ఎన్నికల ప్రక్రియలో ప్రతిదశలోనూ పాల్గొనే అభ్యర్థులు, పార్టీలు.. ఏ దశలోనూ అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా, అప్పీళ్లు దాఖలు చేయకుండా.. ఎన్నికలు ముగిశాక మాత్రం ప్రజల్లో ఆ ప్రక్రియపై అనుమానాలు రేకెత్తించే ప్రయత్నాలు చేయడం అవాంఛనీయం అని ఆయన ఆవేదన వెలిబుచ్చారు.

# కారణజన్ముడు కెసిఆర్

ఈ సందర్భంగా కెసిఆర్ జీవిత, రాజకీయ ప్రస్థానంపై రూపొందించిన ప్రత్యేక డాక్యుమెంటరీని ప్రదర్శించారు.

**కెసిఆర్ నాకు మాత్రమే కాదు..యావత్ తెలంగాణ జాతికి హీరో : కెటిఆర్**

కెసిఆర్ కేవలం తనకు మాత్రమే కాదు యావత్ తెలంగాణ జాతికి హీరో అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. కోట్లాదిమంది ప్రజల తరఫున తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని స్వప్నించి, 25 సంవత్సరాల పాటు తెలుగు రాజకీయాలను శాసించి చావు నోట్లో తలపెట్టి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కారణజన్ముడు కెసిఆర్ అని పేర్కొన్నారు. అలాంటి కెసిఆర్ కొడుకుగా పుట్టడం తన పూర్వజన్మ సుకృతమని వ్యాఖ్యానించారు. ఉద్యమం కోసం నడుం బిగించిన నాడు కెసిఆర్‌కు మీడియా, మనీ, మజిల్ పవర్ లేకుండా తెలంగాణను సాధించిన ఘనత కెసిఆర్‌కే దక్కుతుందని చెప్పారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఉద్యమాన్ని నడిపారని, చావు నోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారన్నారు. తెలంగాణలోని ఏ మూలకు పోయినా తిరిగి కెసిఆరే ముఖ్యమంత్రి కావాలన్న స్వరాలు వినిపిస్తున్నాయన్నారని చెప్పారు. కెసిఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రి చేసే ఏకైక లక్ష్యంతో 60 లక్షల గులాబీ దండు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇదే ఆ మహానుభావుడికి గులాబీ సైనికులు ఇచ్చే పుట్టిన రోజు కానుక అని పేర్కొన్నారు. తెలంగాణ అనే పసి గుడ్డును తిరిగి తండ్రి చేతిలో పెట్టడమే మనం కెసిఆర్‌కు ఇచ్చే బహుమానం అని వ్యాఖ్యానించారు.

**కెసిఆర్ అంటే ఒక వ్యక్తి కాదు.. నాలుగు కోట్ల ప్రజల భావోద్వేగం : హరీష్‌రావు**

కెసిఆర్ అంటే ఒక వ్యక్తి కాదు, ఒక నాయకుడు కాదు, నాలుగు కోట్ల ప్రజల భావోద్వేగం మాజీ మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యానించారు. కెసిఆర్ 1954లో పుట్టారని, ఆయన పుట్టిన రెండేళ్లకే ఉన్న తెలంగాణను ఆనాటి కాంగ్రెస్ పార్టీ ఆంధ్రలో కలిపిందని అన్నారు. 1969లో మలి దశ తెలంగాణ ఉద్యమం వచ్చిన నాడు కెసిఆర్ వయస్సు 16 ఏండ్లు అని, ఆ వయసులోనే జై తెలంగాణ అంటూ ఉద్యమంలో పాల్గొన్నారని చెప్పారు. 1969 నుంచి 2001 మధ్య అనేక మంది జై తెలంగాణ అని ఉద్యమం ప్రారంభించి, పదవి రాగానే మధ్యలో వదిలి పెట్టారని, దాని వల్ల ప్రజల్లో అపనమ్మకం కలిగిందని అన్నారు. ఆ అపవాదును తొలగించడానికి కెసిఆర్ మూడు పదవులను గడ్డి పోచలుగా త్యజించి, తెలంగాణ ప్రజల్లో నమ్మకం కల్పించారని తెలిపారు. పదవుల కోసం తెలంగాణ ఉద్యమం చేస్తున్నారని నాటి నాయకులు కెసిఆర్‌ను విమర్శించారని, టిడిపి నుంచి వచ్చిన మూడు పదవులకూ రాజీనామా చేసి ప్రొఫెసర్ జయశంకర్‌తో కలిసి ఆయన నడిచారని గుర్తు చేశారు.

కెసిఆర్‌ను వ్యక్తిత్వ హననం చేయాలని చూశారని, ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఉక్కు సంకల్పం, మొండి పట్టుదలతో తెలంగాణ కోసం ఆయన పోరాడారని చెప్పారు. ఆమరణ దీక్షకు కూర్చొని 'కెసిఆర్ చచ్చుడో తెలంగాణ వచ్చుడో' అనే నినాదంతో ముందుకెళ్లారని, కెసిఆర్ దీక్షకు తలొగ్గి అప్పటి కేంద్ర మంత్రి చిదంబరం తెలంగాణ ఏర్పాటు చేస్తామని ప్రకటించారని తెలిపారు. కానీ లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వాలని అలా ఇస్తేనే దీక్ష విరమిస్తానని కెసిఆర్ మొండిపట్టుపడ్డారని, ఆ విధంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని చెప్పారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు తెలంగాణను రోల్ మోడల్‌గా కెసిఆర్ నిలిపారని అన్నారు. కెసిఆర్‌ది, తెలంగాణ రాష్ట్రానిది తల్లీబిడ్డ బంధం అని వ్యాఖ్యానించారు. కెసిఆర్ పాలనపై కొంత మంది అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. టీ 20 మ్యాచ్ ఆడుతున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి అంటున్నారని, రేవంత్ టీ20 మ్యాచ్ ఆడేది డబ్బు సంచుల కోసం అని విమర్శించారు. సిఎం మాటల్లో తొండి, హామీల అమల్లో తొండి అని, కానీ కలెక్షన్లలో మాత్రం 2020 అని పేర్కొన్నారు. దీపం ఉండంగానే ఇళ్లు సక్కబెట్టుకోవాలని సదురుకుంటున్నారని ఆరోపించారు. కెసిఆర్‌కు టెస్టు, వన్ డే, 2020 ఏదైనా అద్భుతంగా ఆడుతారని,

ఎప్పుడు ఏది ఆడాలో కెసిఆర్‌కు బాగా తెలుసు అని పేర్కొన్నారు. అవసరం అయితే డిఫెన్స్ అడుతారు.. అవసరం అయితే సిక్స్‌లు కొడుతారని చెప్పారు. తెలంగాణలో ఎక్కడికి పోయినా కూలీ పని చేసుకునే వాళ్ల దగ్గర నుంచి రోడ్ల మీద పోయే పిల్లల వరకు అందరూ కెసిఆర్ రావాలి అంటున్నారని, రేవంత్ పాలన బాగోలేదని తిడుతున్నారని అన్నారు. ఇప్పుడు మనం ఓడిపోవచ్చు.. కానీ, వచ్చే ఎన్నికల్లో గెలుపు మనదే అంటూ పార్టీ శ్రేణులకు ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు. ఈసారి గెలిస్తే మళ్లీ మూడు టర్మ్‌లు మనమే ఉంటామని, ఎవరెవరో ఏదేదో మాట్లాడుతున్నారు, అవన్నీ పట్టించుకోవాల్సిన అవసరం లేదని చెప్పారు.

# ఆలయాలకు ఆగమ స్వేచ్ఛ!

ప్రయాగరాజ్‌లో మహాకుంభమేళా జరుగుతున్న తరుణంలోనే తిరుపతిలో ఆలయాల మహాకుంభ్ ప్రారంభమవుతుండడం అదృష్టదాయకమన్నారు. సోమవారం సాయంత్రం తిరుపతి ఆశా కన్వెన్షన్‌లో అంతర్జాతీయ ఆలయాల సదస్సు-ప్రదర్శన (ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో-ఐటీసీఎక్స్-2025) ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మూడు రోజులు జరిగే ఈ సదస్సుకు రాష్ట్రప్రభుత్వం ఆతిథ్యం ఇస్తోంది. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర, గోవా ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడణవీస్, ప్రమోద్ సావంత్, కేంద్ర మంత్రి శ్రీపాద యశోనాయక్ కూడా హాజరయ్యారు. దేశానికి సరైన సమయంలో నరేంద్ర మోదీ వంటి నాయకుడు లభించాడని, వికసిత్ భారత్ లక్ష్యంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రధాని కృషి చేస్తున్నారని చంద్రబాబు ఈ సందర్భంగా ప్రశంసించారు

రాష్ట్రంలో ఆలయాలకు స్వతంత్ర ప్రతిపత్తి ఇస్తామని.. ముఖ్యంగా వైదిక, ఆగమ వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యం ఉండదని సీఎం స్పష్టం చేశారు. గుళ్ల రక్షణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామని.. ఇటీవలే దేవదాయ శాఖ చట్టాన్ని సవరించామని తెలిపారు. అర్చకుల పారితోషికాలు పెంచామని గుర్తు చేశారు. 'గత ఏడెనిమిది నెలల్లో ఆలయాల అభివృద్ధికి రూ. 138 కోట్లు ఖర్చు చేశాం. వేద విద్య అభ్యసించిన వారికి ఆలయాల్లో పని దొరికేదాకా నెలవారీ భృతి ఇస్తున్నాం. ప్రతి ఆలయ ట్రస్టు బోర్డులో బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులు సభ్యులుగా ఉండేలా చట్టం తెచ్చాం. అన్ని గుళ్లలో ఐవీఆర్ఎస్ ద్వారా భక్తుల అభిప్రాయాలు సేకరిస్తున్నాం. క్యూఆర్ కోడ్‌తో ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నాం. ఏఐ, సీసీ కెమెరాలు, డ్రోన్ పెట్రోలింగ్ వంటివి చేస్తున్నాం' అని చెప్పారు. ఐటీసీఎక్స్-2025 ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ, సిక్కు, బౌద్ధ, జైన ఆలయాల ట్రస్టులను ఏకం చేస్తోందన్నారు. ఆలయాల ఉత్తమ నిర్వహణ, భద్రత, పారదర్శక ఆర్థిక వ్యవస్థల కోసం కృషి చేస్తోందని చెప్పారు. ఆలయాల యాజమాన్యాలను ఒకే వేదికపైకి తెచ్చి ఆలయాల అభివృద్ధితో పాటు భక్తుల సంక్షేమానికి చర్యలు తీసుకునే లక్ష్యంతో ముందుకు రావడం సంతోషకరమని చెప్పారు. 'వారాణసీలో తొలి సదస్సు నిర్వహించిన ఐటీసీఎక్స్ రెండో సదస్సును సరైన సమయంలో తిరుపతిలో నిర్వహిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 1,500కు పైగా ఆలయాల కమిటీలు కలుస్తుండడం గొప్ప విషయం. వర్చువల్‌గా కూడా ఎంతోమంది ప్రముఖులు పాల్గొంటున్నారు. ప్రత్యక్షంగా 111 మంది వక్తలు పాల్గొని ఆలయాల నిర్వహణపై దిశానిర్దేశం చేస్తుండడం ప్రశంసనీయం. 15 వర్క్‌షాపులతో పాటు 60కి పైగా వివిధ స్టాల్స్ ఏర్పాటు ఆలయాల సక్రమ నిర్వహణకు ఉపకరిస్తాయి' అని చెప్పారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

**ఆలయాల ఎకానమీ రూ.6 లక్షల కోట్లు!**

ఆలయాలన్నీ భారతీయ సంస్కృతి, వారసత్వంతో ముడిపడి ఉన్నాయి. వాటిని అందరం కాపాడుకోవాలి. దేశంలో ఆలయాలు రూ. 6 లక్షల కోట్లతో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించాయి. 1985-86లో నాటి సీఎం ఎన్టీఆర్ తిరుమలలో ప్రారంభించిన అన్నదాన పథకం ట్రస్టుకు ఇప్పుడు రూ.3 వేల కోట్ల కార్పస్ ఫండ్ చేకూరింది. నేను గతంలో టీటీడీ ద్వారా శ్రీవారి ప్రాణదాన ట్రస్టును ప్రారంభించగా.. ప్రస్తుతం దానికి రూ.440 కోట్ల విరాళాలు సమకూరాయి.

అట్టహాసంగా ప్రారంభం.. తిరుపతిలో ఐటీసీఎక్స్-2025 పేరిట అలయ సదస్సు అట్టహాసంగా ప్రారంభమైంది. టెంపుల్ కనెక్ట్ సంస్థ అతిరథ మహారథులు, ఆధ్యాత్మిక గురువులు, ఆలయ ట్రస్టీలు, అధికారులను ఒకచోటకు చేర్చింది. ప్రధాని మోదీ లేఖ ద్వారా తన సందేశాన్ని అందించగా.. ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ వర్చువల్‌గా పాల్గొన్నారు. సమావేశంలో ఆధ్యాత్మికవేత్త ఆచార్యగోవింద్ దేవ్ గురూజీ, ఆర్ఎస్ఎస్ సంయుక్త కార్యదర్శి ముకుంద్, మంత్రి అనగాని సత్యప్రసాద్, మహారాష్ట్ర మంత్రులు ఆశిష్ షెలార్, మేఘన బోర్డికర్, గోవా మంత్రి విశ్వజిత్ రాణే, ఎంపీ ప్రవీణ్ దార్కేర్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అంత్యోదయ ప్రతిష్టాన్ చైర్‌పర్సన్ నీతాలాడ్ పాల్గొన్నారు. మంగళవారం విశ్వహిందూ పరిషత్ ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే, తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై, సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ మాజీ చైర్మన్ సురేశ్ హావారే, గోవా పర్యాటక మంత్రి రోహన్, ఇస్కాన్ కమ్యునికేషన్స్ డైరెక్టర్ గోవిందాదాస్ తదితరులు పాల్గొంటారు.

# కృష్ణాజలాల్లో ఎపి ఏకపక్ష వినియోగంపై కేంద్రానికి ఫిర్యాదు

కృష్ణాజలాల వాటాల వినియోగంలో వివాదాలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు టెలిమెట్రీ విధానమే శ్రేయస్కారమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. కృష్ణా జలాల నీటి వాటాల పంపిణీ, నీటి వాటాల వినియోగాన్ని లెక్కించే బాధ్యత కేంద్ర జల సంఘంపైనే ఉందని సీఎం గుర్తు చేశారు. అయితే టెలీమెట్రీ విధానం అమలుకు అయ్యే ఖర్చులో సగం నిధులను ముందుగా మన ప్రభుత్వమే చెల్లిస్తుందని అధికారులు తెలిపారు. కానీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెలీమెట్రీ నిధుల విడుదలకు ముందుకు రావడం లేదని నీటిపారుదల ఉన్నతాధికారులు సీఎం దృష్టికి తీసుకు వచ్చారు. దాంతో వెంటనే కృష్ణా రివర్‌మేనేజ్‌మెంట్ బోర్డు(కేఆర్ఎంబీ)కి సమగ్ర వివరాలతో లేఖ రాయాలని ఇరిగేషన్ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాను ముఖ్యమంత్రి ఆదేశించారు.

**ఎక్కడా పంటలు ఎండొద్దు**

ఎక్కడా కూడా రైతులకు నీటి ఎద్దడిరాకుండా, ఎక్కడా కూడా పంటలు ఎండిపోకుండా చూడాల్సిన బాధ్యత మీదేనని సీఎం స్పష్టం చేశారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, ఎస్సారెస్పీతో పాటు ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల్లో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు, నీటి వినియోగం వివరాలను సీఎంకు అధికారులు వివరించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాల పరిధిలో తాగు నీరు, సాగునీటిని అందించేందుకు ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటూ ఆయా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక కార్యాచరణ, ప్రణాళికలను రూపొందించు కోవాలని సూచించారు.

**కలెక్టర్లకు ఆయకట్టుసాగు బాధ్యతలు**

నాగార్జున సాగర్, ఎస్సారెస్పీ ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టు సాగు పంటల విస్తీర్ణం, వాటికి అవసరమైన నీటి విడుదల అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లు సంబంధిత ఇరిగేషన్ ఇంజనీర్లతో తక్షణమే సమావేశాలు నిర్వహించుకోవాలని సీఎం ఆదేశించారు. ప్రాజెక్టులు, కాల్వలు, ఆయకట్టులో పంటలు, నీటి విడుదల తీరును జిల్లాకలెక్టర్లు స్వయంగా పరిశీలించాలని స్పష్టం చేశారు. నిర్ణీత ఎజెండాను ఖరారు చేసుకొని అన్ని జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి, తదనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు.

# జర్నలిస్టుల రక్షణ బాధ్యత ప్రభుత్వాలదే

**-పాత్రికేయుల కోసం సమగ్ర చట్టం చేయాల్సిందే**
**-విశాఖలో కదంతొక్కిన జర్నలిస్టులు**
**-డీఐజీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పణ**

ఆంధ్రా యూనివర్శిటీ,విశాఖపట్నం, ఫిబ్రవరి17(ప్రజాక్షేత్రం):
దేశ వ్యాప్తంగా జర్నలిస్టుల రక్షణ బాధ్యత కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలదేనని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి(ఎన్ఎజె) గంట్ల శ్రీనుబాబు కోరారు. పాత్రికేయుల రక్షణ కోసం ప్రభుత్వాలు ప్రత్యేకంగా చట్టం చేయాలని,రెండు దశాబ్ధాలుగా పాత్రికేయ సంఘాలు కోరుతున్నాయన్నారు. విజయనగరం జిల్లా మక్కువ మండలం ప్రజాశక్తి రిపోర్టర్ మల్వాడా రామారావుపై అక్కడ టీడీపీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు దాడి చేయడంతో పాటు, రామారావును చంపుతానని బెదిరంచడంతో సోమవారం ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్,ఏపీ బ్రాడ్కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్,ఏపి స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా డీఐజీలు,కమిషనర్లు, కలెక్టర్లుకు స్ధానిక నాయకత్వాలు వినతిపత్రాలు అందజేశాయి.రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు విశాఖలో కూడా విశాఖ డీఐజీ గోపినాధ్ జెట్టి కార్యాలయంలో జర్నలిస్టులంతా కార్యాలయం మేనేజర్ సూర్యారావు,సీసీ గణేష్‌లను కలసి వినతిపత్రం



అందించారు.అంతకు ముందు ఏయూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాలు అందించి, అక్కడి నుంచి జర్నలిస్టులంతా ర్యాలీగా డీఐజీ కార్యాలయానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా జర్నలిస్టులను కాపాడాలని, అలాగే దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని, జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మీడియాతో మాట్లాడుతూ నేటి తరం నాయకులు కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వంటి ఆపార అనుభవం ఉన్న నాయకులను చూసి ఎంతో నేర్చుకోవాలన్నారు.ఎదిగే కొద్ది ఒదిగి ఉండాలని,అలా కాకుండా జర్నలిస్టులను చంపుతానని బెదిరించడం ఏమిటని ప్రశ్నించారు. ఫెడరేషన్ రాష్ట కౌన్సిల్ సభ్యులు మధుసూధనరావు మాట్లాడుతూ ప్రజాశక్తి పాత్రికేయుడు రామారావుపై దాడి చేసి బెదిరించిన వేణుగోపాల్ నాయుడును తక్షణమే అరెస్టు చేసి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరింతగా ఆందోళన చేసేందుకు తాము సిద్ధమన్నారు.ఫెడరేషన్ అర్భన్ కార్యదర్శి జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్రాడ్కాస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు ఇరోతి ఈశ్వరరావు, కె. మధన్,ఉపాధ్యక్షడు మళ్ల దేవత్రినాధ్,నాయుడు, ఏపియూడబ్ల్యూజె అర్బన్ కార్యదర్శి ఆర్, రామచంద్రరావు,స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్,ప్రజాశక్తి సీనియర్ పాత్రికేయులు అప్పలనాయుడు, వెంకటేష్,ఫేడరేషన్, బ్రాడ్కాస్ట్ సభ్యులు కె.అప్పలనాయుడు, సత్యనారాయణ,పి.వెంకట్, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, నగేష్‌బాబు,కృష్ణమూర్తి, రామకృష్ణ,పి.సతీష్‌బాబు, కిషోర్,రాజేష్,శ్రీలత అధిక సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.ఇదిలా ఉండగా జర్నలిస్టుల అందించిన వినతిపత్రాన్ని అధికారులు పరిశీలించారు.తక్షణమే డీఐజీ గోపినాధ్‌జెట్టి దృష్టికి తీసుకువెళ్లి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## మంబాపూర్ గ్రామంలో ఘనంగా కెసిఆర్ జన్మదిన వేడుకలు.



పెద్దేముల్ ఫిబ్రవరి 17(ప్రజాక్షేత్రం):
బీఆర్ఎస్ పార్టీ అధినేత,తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, కే చంద్రశేఖర రావు జన్మదిన వేడుకలను మంబాపూర్ గ్రామంలో పార్టీ కార్యకర్తలు నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సమయంలో కేక్ కటింగ్ చేసి ఒకరికి ఒకరు తినిపిస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచ్ శ్రావణ్ మాట్లాడుతూ.. కార్యకర్తలు ఎవరు అధైర్య పడొద్దు, మళ్లీ మనమే అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల్లో టిఆర్ఎస్ పార్టీ అత్యధిక సీట్లు సాధిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరు పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని అన్నారు. భవిష్యత్తులో మళ్లీ టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుంది కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని జోష్యం చెప్పారు. కాగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తి కెసిఆర్ అని వెల్లడించారు. కెసిఆర్ రైతుల పాలిట ఆపద్బాంధవుడు అని 10 సంవత్సరాలు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రావణ్ కుమార్, పార్టీ కార్యకర్తలు, యువకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కెసిఆర్ జన్మదిన వేడుకలు

**-ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు,బ్రెడ్లను పంపిణీ చేసి,అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ జడ్పీటీసీ,జోగులాంబ గద్వాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ నాయకులు బాసుశ్యామల హనుమంతు నాయుడు**



గద్వాల,ఫిబ్రవరి 17(ప్రజాక్షేత్రం):
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి మార్గదర్శకుడు రాష్ట్ర అభివృద్ధికి అంకితమైన నాయకుడు గులాబీ దళపతి తెలంగాణ తొలి ముఖ్యమంత్రివర్యులు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన పురస్కరించుకొని బాసు హనుమంతు నాయుడు ఓ అపూర్వమైన సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. సామాజిక సేవగా పత్రికగా,ఆయన గద్వాల జిల్లా కేంద్రంలోని,జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు మరియు బెడ్లను పంపిణీ చేశారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తెలంగాణ అభివృద్ధికి కేసీఆర్ గారు చేసిన కృషిని గుండెల్లో పెట్టుకున్న ప్రతి కార్యకర్త,అభిమాన్ని,ప్రజానీకం ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సంకల్పించాలీ అని అన్నారు.ఈ సేవా కార్యక్రమం కేసీఆర్ ప్రజాస్వామ్యం దృక్పథాన్ని ప్రతిబింబిస్తూ,సమాచారం మంచి మార్పుకు మార్గదర్శకంగా నిలుస్తోంది అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండల,గ్రామాల పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు,యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ం

## బషీరాబాద్ లో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

బషీరాబాద్ ఫిబ్రవరి 17 (ప్రజాక్షేత్రం):
బషీరాబాద్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా జరుపు కున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తల్లి ప్రమోదిని దేవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ క్రమంలో కేక్ కటింగ్ నిర్వహించి ఒకరికొకరు తినిపిస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కార్యకర్తలు ఎవరు కూడా అధైర్య పడొద్దు, మళ్లీ మనమే అధికారంలోకి వస్తాము అని కార్యకర్తలకు బలాన్ని ఇచ్చారు. అదేవిధంగా పార్టీ కార్యక్రమాలు భవిష్యత్తులో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి విధివిధానాల గురించి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కాగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఏవైతే ఆరు గ్యారెంటీలు ప్రకటించిందో.. అవి ఇస్తానని చెప్పి ఇవ్వకుండా ప్రజలను మోసం చేసిందని ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం



వచ్చి ఇప్పటికీ ఏడాది పైగా పూర్తయింది, అయినప్పటికీ ఆరు గ్యారెంటీలా విషయంలో కాలయాపన చేస్తూ ప్రజలకు మొండి చెయ్యి చూపిస్తుందని విమర్శించారు. ప్రజలు ఇవన్నీ గమనించి రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ పార్టీకి పట్టం కడతారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు పంజుల నర్సింహారెడ్డి (రాజు), రజక్ బాయ్ సొసైటీ కో ఆప్షన్ నెంబర్, సొసైటీ డైరెక్టర్లు నవీన్ రెడ్డి,హన్మంతు రెడ్డి,కృష్ణ మాజీ సొసైటీ డైరెక్టర్, ఎంపిటిసి రాజు, బషీరాబాద్ మాజీ సర్పంచ్, పార్టీ కార్యకర్తలు ప్రతాప్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, నడిపల్లి వెంకటయ్య, శీను, గోపి సింగ్, లవకుమార్ తదితరులు పాల్గొన్నారు

## బషీరాబాద్ మండల ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన డి రాములు



బషీరాబాద్ ఫిబ్రవరి 17(ప్రజాక్షేత్రం):
బషీరాబాద్ మండల విద్య అధికారిగా డి.రాములు సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు రాములను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత రెండు రోజులు సెలవులు ఉండటంతో సోమవారం ఎంఈఓ గా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్య వ్యవస్థను ఉన్నత స్థాయిలో తీసుకురావడానికి నా వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులతో కలిసి మెలిసి పనిచేస్తూ నాణ్యమైన విద్యను అందిస్తామని తెలిపారు.ం

## కెమెరామేన్ తండ్రి అంత్యక్రియలకు ఏపీజేయూ గౌరవాధ్యక్షులు డా.కంచర్ల చేయూత

**-అంత్యక్రియలకు రూ.20వేలు ఆర్థిక సహాయం**

విశాఖపట్నం,ఫిబ్రవరి 17(ప్రజాక్షేత్రం):
విశాఖలో వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఏపీజేయూ) రాష్ట్ర గౌరవాధ్యక్షులు, ఉపకార్ ట్రస్టు చైర్మన్ డా.కంచర్ల అచ్యుతరావు జర్నలిస్టుల కుటుంబాల కష్టాల్లోనూ ఇతోదికంగా పాలు పంచుకుంటున్నారు. విశాఖలో ఒక న్యూస్ ఛానల్ లో కెమెరామాన్ గా పనిచేస్తున్న చుక్కల విజయ్ కుమార్ తండ్రి, చుక్కల ఆంతోని మృతి చెందడంతో ఆ కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం రూ.20వేలు ఆర్ధిక సహాయం చేశారు. అనునిత్యం సేవా కార్యక్రమాల్లో ముందుంటే డా.కంచర్ల అచ్యుతరావు జర్నలిస్టులు, కళాకారులు, సినిమా వర్గాలకు చెందిన వారి కుటుంబాల్లో ఎవరు కాలం చేసినా మట్టి ఖర్చుల క్రింద రూ.10వేలు ఆర్ధిక సహాయం చేస్తూ వస్తు న్నారు. ఈ క్రమంలోనే జర్నలిస్టు తండ్రి పరమపదించడంతో తనవంతు సహాయంగా ఈ



మొత్తాన్ని అందించి ఆర్ధిక చేయూత నందించారు.దీనితో జర్నలిస్టుల కుటుంబాలకు పెద్దదిక్కుగా ఉంటూ తమ వెన్నుదన్నుగా నిలబడు తున్నారని కెమెరామేన్ విజయ్ కుమార్ ధన్యవాదములు తెలియజేశారు .ఈ సందర్భంగా ఏపీజేయూ గౌరవాధ్యక్షులు డా.కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ, తనకు మీడియా అంటే ఆరోప్రాణమని.. తన పెద్ద కుటుంబమని.. అలాంటి కుటుంబంలో ఏ ఒక్కరికి ఆపదన్నా ఆదుకోవడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని పేర్కొన్నారు. ఏ ఒక్క జర్నలిస్టుకి కష్టం వచ్చినా.. సదరు కుటుంబాల్లోని వారు కాలం చేసిన సమయంలో ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. తాను ఇచ్చిన మాట మేరకు జర్నలిస్టులకు అన్ని రకాలుగా సహాయం అందించేందుకు సిద్దంగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఆది నుంచి జర్నలిస్టుల పక్షపాతిగా నిలుస్తూ.. రాష్ట్రంలోనే అత్యధిక మొత్తంలో వర్కింగ్ జర్నలిస్టులు, మీడియాలో పనిచేసే జర్నలిస్టులకు ఆర్ధిక సహాయం చేస్తున్న డా.కంచర్లపై మీడియా, కళాకారుల నుంచి పెద్ద మొత్తంలో ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

## మాకు నీళ్ల ఇబ్బందులు తీర్చండి



బషీరాబాద్ ఫిబ్రవరి 17 (ప్రజాక్షేత్రం):
మాకు తాగునీరు సమస్యలు తీర్చండి అంటూ జీవనిగి గ్రామ ప్రజలు నీళ్ల బిందెలతో రోడ్లపైకి వచ్చారు. వివరాలు..బషీరాబాద్ మండల పరిధిలోని జీవన్గి గ్రామంలో మాకు మంచినీళ్ల ఇబ్బందులు తీర్చండి అని మహిళలు ఆందోళన చేశారు. గ్రామానికి మిషన్ భగీరథ నీళ్లు వచ్చినప్పటికీ అవి సరిపోవడం లేదని, ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే వేసవిలో ఇంకెలా ఉంటుందో అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి మాకు నీటి కష్టాలు తీర్చండి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

## పొలం ఫెన్సింగ్ ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**-పాపటపల్లి రైల్వే స్టేషన్లో 60 ఏండ్ల చెట్టుని అక్రమంగా నరికి అమ్ముకున్న వారిపై చర్యలు చేపట్టాలి**




ఖమ్మం,ఫిబ్రవరి 17(ప్రజాక్షేత్రం):
పాపటపల్లి రైల్వే స్టేషన్ పక్క గల భూమి చుట్టూ వేసుకున్న ఫెన్సింగ్ ను ధ్వసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పాపటపల్లి గ్రామానికి చెందిన కొదుమూరి శ్రీనివాసరావు అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొదుమూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సొంత గ్రామం పాపటపల్లి అయిన్నప్పటికీ హైదరాబాద్ లో జీవిస్తున్నానన్నారు. పాపటపల్లి రైల్వే స్టేషన్ పక్క గల మా భూమి చుట్టూ వేసుకున్న ఫెన్సింగ్ ను ధ్వసం చేశారని ఆరోపించారు. అధికారులు ఫెన్సింగ్ ధ్వసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. అదేవిధంగా పాపటపల్లి రైల్వే స్టేషన్ లో 60 ఏండ్లుగా ప్రయాణికులకు నీడనిచ్చే చెట్టును అక్రమంగా నరికి మా చేను ఫెన్సింగ్ ను ధ్వసం చేసి తద్వారా రవాణా చేశారని ఆరోపించారు.జిల్లా అధికారులు,ఫారెస్ట్ అధికారులు పూర్తిస్థాయిలో విచారణచేసి న్యాయం చేయాలని శ్రీనివాసరావు కోరారు.

## వలిగొండ ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా మార్చాలి : డి వై ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షులు

వలిగొండ,ఫి బ్రవరి 17 (ప్రజాక్షేత్రం):
భువనగిరి జిల్లా, వలిగొండ మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా మార్చి,మండల ప్రజలకు 24 గంటలు వైద్యాన్ని అందించాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కవిడే సురేష్, మండల అధ్యక్షులు జ్ఞానబోయిన యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రోజున సంఘం ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి సర్వే నిర్వహించి సమస్యలని అడిగి తెలుసుకున్నారు.ఈ వారు సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ మెరుగైన వైద్యం సేవలందించడమే మా ధ్యేయం ఉంటుంది.ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో సమస్యలు ఉన్నాయన్నారు.సరియైన వైద్యం అందక, ప్రైవేట్ ఆస్పత్రులను పేదల ఆశ్రయించి ఇబ్బందులు



పడుతున్నారని అన్నారు. ఆరోగ్య కేంద్రాన్ని రోజుకు సుమారు 200 మంది పేదలు, వైద్యం కోసం వస్తున్నారని, కేవలం 6 బెడ్లకు సంబంధించిన ఆసుపత్రి కావడం వలన ఈ రోగులు ఇబ్బంది పడుతున్నారు అన్నారు.సాయంత్రం ఐదు గంటలు దాటితే కేంద్రంలో ఒక డాక్టర్ కూడా ఉండకపోవడం, ఆపరేషన్ చేసే అవకాశం లేకపోవడంతో,ఎక్సరే సదుపాయం ల్యాబ్ పరికరాలు లేనందున,ప్రైవేట్ ఆస్పత్రికి పోతే వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు అన్నారు.30 పడకల ఆసుపత్రిగా మార్చి ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు బండమీది సుందరయ్య, ఆకుల రాజు,మండల నాయకులు లింగస్వామి, మల్లేశం,శ్రీకాంత్ పాల్గొన్నారు.

## తూతూ మంత్రంగా ప్రజావాణి.

**-ప్రజావాణికి వివిధ శాఖల అధికారుల గైర్హాజరు.**



బషీరాబాద్ ఫిబ్రవరి 17(ప్రజాక్షేత్రం):
బషీరాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం తూతు మంత్రంగానే ప్రజావాణి సాగింది. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కానీ బషీరాబాద్ మండల్ పరిషత్ కార్యాలయంలో ప్రతివారం మెజార్టీ అధికారులు హాజరు కాక ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారులకు చెప్పుకోలేక వెను తిరుగుతున్నారు. ఈ క్రమంలో ప్రజావాణిలో దామర్చేడ్ గ్రామ జమ్లా నాయక్ తండా కి చెందిన జైరాం అనే వ్యక్తి పింఛన్ సంబంధించి ఫిర్యాదు అందించారు. ప్రజావాణికి మెజార్టీ అధికారుల గైర్హాజరు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి కేవలం కొందరు అధికారులు మాత్రమే హాజరయ్యారు. వివిధ శాఖల అధికారులు కార్యక్రమానికి హాజరు కాకపోవడంతో కార్యక్రమం అంతంత మాత్రంగానే కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్ కుమార్ ఎమ్మార్వో వై వెంకటేష్, ఏపిఎం, ఏఓ అనిత, ఐసిడిఎస్ సూపర్వైజర్ జ్యోతి, ఏ ఈ యశ్వంత్ మాత్రమే ఉన్నారు

# నకిలీ పత్తి విత్తనాలు సీజ్..!

- నిందితుని పైన కేసు నమోదు.
- రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు.. జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి.
- రూ.10లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాలు సీజ్.
- పెద్దేముల్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆచూకీ లభ్యం.

పెద్దేముల్ ఫిబ్రవరి 17(ప్రజాక్షేత్రం):
సుమారు పది లక్షల విలువైన భారీ నకిలీ పత్తి విత్తనాలను సోమవారం పోలీసులు సీజ్ చేశారు. ఎస్పీ నారాయణరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు తేది 16వ తేదీ నాడు జిల్లా టాస్క్ ఫోర్స్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్,టాస్క్ ఫోర్స్ టీమ్, పెద్దేముల్ పోలీస్ అధికారులు మరియు పెద్దేముల్ వ్యవసాయాధికారి పి.పవన్ ప్రీతం లు పెద్దేముల్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఒక వ్యక్తి నాలుగు ప్లాస్టిక్ సంచులతో అనుమానాస్పదంగా కనిపించాడు.అతనితో పాటు తన దగ్గర ఉన్న సంచులను పరిశీలించగ.. వాటిలో ఎలాంటి లేబుల్స్ కాని,లాట్ నెంబర్ గాని,బ్యాచ్ నెంబర్స్ గాని , తయారుచేసిన తేది గాని,గడువు తేది గాని ఎలాంటి సమాచారం లేకుండా పత్తి విత్తనాల ప్యాకెట్లు ఉన్నాయి. మరియు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా పత్తి విత్తనాలు ఉన్నాయి.ఇట్టి విత్తనాలను వ్యవసాయాధికారి పరిశీలించగా నకిలీ పత్తి విత్తనాలు అని తేలింది.ఈ సమయంలో సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన.. ఉప్పలపాటి వసంత్ రావు, నివాసం కోనంకి గ్రామం, మర్టూర్ మండలం , బాపట్ల జిల్లా. అయితే అతను గత 15 సంరత్సరాల నుండి గాజుర్ కోట్ గ్రామం, గుర్మిట్కల్ తాలూకా, యాద్గీర్ జిల్లా.. కర్ణాటకలో నివాసం ఉంటున్నాడు అని తెలిపినాడు. ఇట్టి సంచులలోని నకిలీ విత్తనాలను గుర్మిట్కల్ నుండి తీసుకొని వచ్చి రైతులకు అమ్మడానికి పెద్దేముల్ వచ్చానని తెలపడం తెలియజేశారు. విత్తనాలు నాటే సమయంలో అనగా జూన్ నెలలో ఈ నకిలీ పత్తి విత్తనాలు తెచ్చి అమ్మితే పోలీస్ అధికారులు.. వ్యవసాయ




అధికారుల నిఘా ఎక్కువగా ఉంటుంది అని,అందుకే ప్రభుత్వ అధికారులకు అనుమానం రాకుండా ఎక్కువ లాభాలను ఆశించి ముందుగానే ఇట్టి నకిలీ పత్తి విత్తనాలను తీసుకొని వచ్చి అమాయక రైతులకు ఎక్కువ ధరలకు అమ్ముతూ మోసపూరితంగా లాభాలు ఆర్జిస్తాము అని తెలియజేయడం జరిగింది. మొత్తం 4 నాలుగు సంచులలో సుమారు రూ.2,70,000 రూపాయల విలువ కల్గిన,150 కేజిల నకిలీ పత్తి విత్తనాలు పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకోవడం జరిగింది.అనంతరం టాస్క్ ఫోర్స్ అధికారులు మరియు పెద్దేముల్ పోలీస్ అధికారులు నిందితుని ప్రస్తుత నివాసం అయిన గాజుర్ కోట్ గ్రామం, గుర్మిట్కల్ తాలూకా, యాద్గీర్ జిల్లా..కర్ణాటక రాష్టం వెళ్ళి సోదాలు నిర్వహించగా, అక్కడ సుమారు రూ.7.2 లక్షల విలువ కల్గిన 4 క్వింటల్లా నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకోవడం జరిగింది. కాగా అతని దగ్గర ఎలాంటి ప్రభుత్వ పత్రాలు కూడా లేవు. సంబంధిత వ్యక్తి పైన పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందని వెల్లడించారు.

**గతంలో కూడా ఇతని పైన కేసులు నమోదు చేశాము. ఎస్పీ**

నకిలీ పత్తి విత్తనాల వ్యాపారం చేస్తుండగా ఇతనిపైన గతంలో బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా కేసు నమోదు చేయడం జరిగింది అని ఎస్పీ నారాయణరెడ్డి వెల్లడించారు.జిల్లా పరిధిలో నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నట్లుగా సమాచారం తెలిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. రైతులు నకిలీ విత్తనాల బారీన పడకుండా ముందస్తు జాగ్రతలు, చర్యలు తీసుకోవాలని,ఎవరైన వ్యాపారస్థులు, సంస్థలు, వ్యక్తులు నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందితే తక్షణమే స్థానిక పోలీసులకుగాని లేదా టాస్క్ ఫోర్స్ అధికారులకు గాని డైల్ 100కు గాని సమాచారం అందించాలని స్పష్టం చేశారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుంది స్పష్టీకరించారు. ఈ మేరకు నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న నిందితుడిని విశ్వాసనీయ సమాచారం మేరకు పెద్దేముల్ ఎస్సై శ్రీధర్ రెడ్డి, కరణ్ కోట్ ఎస్ఐ నాగేష్, టాస్క్ ఫోర్స్ ఎస్సై ప్రశాంత్ వర్ధన్ లను జిల్లా ఎస్పీ అభినందించారు.

**సీజ్ చేసిన నకిలీ పత్తి విత్తనాల వివరాలు..**

1) నాలుగు ప్లాస్టిక్ సంచులలో సుమారు రూ.2.7 లక్షల విలువ కల్గిన 150 కేజిల నకిలీ విత్తనాలు.
2) నిందితుని నివాసంలో సుమారు రూ .7.2 లక్షల విలువ కల్గిన 400 కేజిల నకిలీ పత్తి విత్తనాలు.

మొత్తం 9,90,000/- రూపాయల విలువ కల్గిన 550 కేజిల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకోవడం జరిగింది.

**నేరస్థుని వివరాలు:**

స్థిర నివాసం: కోనంకి గ్రామం. మర్టూర్ మండలం,బాపట్ల జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ రాష్టం.
ఉప్పలపాటి వసంతరావు.
ప్రసెంట్ అడ్రెస్: గాజుర్ కోట్ గ్రామం, గుర్మిట్కల్ తాలూకా , యాద్గీర్ జిల్లా , కర్ణాటక రాష్టం.

## ఘనంగా తెలంగాణ తొలి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు



మొయినాబాద్,ఫిబ్రవరి 17 (ప్రజాక్షేత్రం):
కెసీఆర్ జన్మదిన సందర్భంగా రాష్ట్ర నాయకులు మరియు మండల నాయకులు కెసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.కేసీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆ భగవంతునికి ప్రార్ధన చేశారు మళ్లీ వచ్చే ఎలక్షన్లో కేసీఆర్ తప్పకుండా ముఖ్యమంత్రి అవుతాడని రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. మొయినాబాద్ మండల అధ్యక్షులు దా రెడ్డి వెంకట్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రదాతగా, ప్రజలకు అండగా మా గుండె నీ గుండెల్లో నిండిన ఇల్లు అని ప్రజల గుండెల్లో జనహృదయ నేతగా, రైతులకు రారాజుగా, రైతు బాంధవుడుగా,ఆసరా పింఛన్లతో అలుపెరగని నేతగా,తెలంగాణ రాష్ట్రమంతా నీటితో నింపి ప్రజల గుండెల్లో పోనిగి పొరులుతున నెలతల్లి గుండెలో అపరభగీరథుడిగా, భావి తెలంగాణ నిర్మాతగా, ఆడబిడ్డ కన్నీళ్లను తుడిచి కల్యాణ లక్ష్మీ తో కన్నతల్లితండ్రిగా,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ జాతి పీత మా నాయకుడు నిండు నూరేళు ఆయురారోగ్యాలతో వర్థిల్లాలి అని ఆయన అన్నారు. అనంతరం కేకు కట్ చేసి పలువురు పంచుకున్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మరియు మండల నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, దా రెడ్డి వెంకట్ రెడ్డి మొయినాబాద్ మండల టిఆర్ఎస్ అధ్యక్షులు,సిద్దేంతీ నరసింహా గౌడ్ జనరల్ సెక్రెటరీ,ఎం ఏ రావూఫ్ మాజీ సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, బసవపురం మంజయ్య గౌడ్ మజీ సర్పంచ్ నక్కలపల్లి, మండల యువజన అధ్యక్షులు పూసల పరమేష,షాబాద్ ప్రవీణ్,నడిమింటి రాములు చిన్న మంగళరం బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు,కుమ్మరి రాము మాజీ సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్, పెంద్యాల శ్రీనివాస్ ఎంకేపల్లి బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు, అమ్డాపూర్ సునిల్,బొట్టు రాకేష్ మరియు తదితర నాయకులు పాల్గొన్నారు.

## 2008 డీఎస్సీ నూతన ఉపాధ్యాయులకి ఆర్డర్ కాపీలు అందజేత

-బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే ఎంఈఓ ఆర్డర్ కాపీలు అందజేత
-వర్షం వ్యక్తం చేసిన నూతన ఉపాధ్యాయులు

ఫిబ్రవరి 17 (ప్రజాక్షేత్రం)
బషీరాబాద్ మండల ఎంఈఓ కార్యాలయంలో సోమవారము 2008 డీఎస్సీ నూతన ఉపాధ్యాయులకి ఎంఈఓ డి రాములు ఆర్డర్ కాపీలు అందించారు. ఈ సందర్భంగా నూతనంగా విధుల్లో చేరబోతున్న ఉపాధ్యాయులను ఉద్దేశించి ఎంఈఓ మాట్లాడుతూ.. మీకు కేటాయించిన పాఠశాలలో హాజరై, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, విద్యాభివృద్ధికి మీ వంతు కృషి చేయాలని పాఠ్యాంశానికి సంబంధించి బోధన ఉపకరణలను సమీకరించుకొని స్పష్టంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని దిశ నిర్దేశం చేశారు.

**ఉపాధ్యాయుల స్పందన**

2008 డీఎస్సీ లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకి సంబంధించి ఇటీవలే హైకోర్టు ఆదేశాల మేరకు పోస్టింగ్లు ఇచ్చిన విషయం అందరికీ తెలిసిందే. ఈ సందర్భంగా




కొందరు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇన్ని సంవత్సరాలు తర్వాత ఉద్యోగంలో చేరబోతున్న తరుణంలో ఎంతో ఆనందంగా ఉందని మా 17 ఏళ్ల పోరాటానికి విజయం దక్కిందని హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడు అంటే నిత్యం విద్యార్థి అని తాము నేర్చుకుంటూ విద్యార్థులకు ప్రతి అంశాన్ని వివరంగా నేర్పిస్తామని తగిన బోధనోపకరణాలను సమీకరించుకుంటూ బోధన కొనసాగిస్తామని తెలిపారు.

## అందె బండ లక్ష్మీ నరసింహా స్వామినీ దర్శించుకున్న నాంపల్లి మాజీ జెడ్పిటీసి ఏవీ రెడ్డి



నాంపల్లి,ఫిబ్రవరి 17(ప్రజాక్షేత్రం):
నాంపల్లి మండలంలోని మెల్లవాయి శ్రీ అందేబండ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు నాంపల్లి మాజీ జెడ్పిటిసి ఎవి రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మైవమ్మ నారాయణ,భాస్కర్ రెడ్డి,మండల కో ఆప్షన్ సభ్యులు ఎస్కే అబ్బాస్ , కాంగ్రెస్ సీనియర్ నాయకులు గెలవాల్ రెడ్డి,సాలయ్య,చంటి, జె యాదగిరి,బి బాబు,తోటపల్లి శ్రీను,జి గిరి, బొడ్డుపల్లి రాములు,నాగరాజు, మందాడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేసిన ఏ జె ఆర్ ఫౌండేషన్ సభ్యులు



వలిగొండ,ఫిబ్రవరి 17 (ప్రజాక్షేత్రం):
యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ మండల పరిధిలోని మొగిలిపాక గ్రామానికి చెందిన గుండెపురి రాజయ్య అనారోగ్యము తో బాధపడుతూ మృతి చెందారు.సమాచారం తెలిసిన వెంటనే సోమవారం రోజున, ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో ,వారి కుటుంబ సభ్యులకు అండగా నిలబడి రూ.5 వేలు అందజేశారు.ఈ కార్యక్రమంలో మొగిలిపాక గ్రామ పెద్దలు,యువకులు, ఏ జే ఆర్ టీం సభ్యులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మేకల మల్లిబాబు యాదవ్,చిత్తారు సింహాద్రి యాదవ్

ఖమ్మం,ఫిబ్రవరి 17(ప్రజాక్షేత్రం)
:సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన రెడ్డి బోయిన తిరుపతిరావు - మల్లిక ల కూతురు.శ్రీహారిక - సతీష్ యాదవ్ ల వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్,జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ లు పాల్గొని నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి హాజరైన యాదవులు జిల్లాలో యాదవ సంఘాల గ్రూపుల రకాలు గురించి చర్చించగా అఖిల భారత యాదవ మహాసభ 1924లో యాదవ మేధావులతో,స్వాతంత్రం రాకముందే ఏ సంఘాలు పుట్టకముందే కేవలం అఖిల భారత యాదవ మహాసభ ఒక్కటే స్థాపించబడిందని, కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ఎక్కడ చూసినా విస్తరించిందని,అఖిల భారత యాదవ మహాసభ జండా క్రింద ఈనాడు ఉత్తర భారత దేశంలో ప్రభంజనం సృష్టిస్తున్నాయని, భారతదేశాన్ని ప్రభావితం చేస్తున్నాయని,మంత్రులు ముఖ్యమంత్రులు కేంద్ర మంత్రులుగా పని చేశారని, అయితే ఈనాడు కొంతమంది స్వార్థం కోసం కొత్త సంఘాలు పెట్టుకుంటున్నారని, ఒకప్పుడు



వాళ్లు కూడా అఖిల భారత యాదవ మహాసభ జెండా కిందనే తిరిగారని, ఏదో ఒక రోజు మళ్ళీ ఆ జెండా కిందికే రావాల్సిన అవసరం ఉంటుందని నాయకులు వ్యాఖ్యానించారు.అఖిల భారత యాదవ మహాసభను అవహేళన చేయాలని ప్రయత్నిస్తే దానికి తగిన మూల్యం కూడా చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇమ్మడి తిరుపతిరావు బండారు ప్రభాకర్,పుట్ట ఉపేందర్,డేగల ఉపేందర్ మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకటేశ్వర్లు,దాసరి వెంకటేశ్వర్లు దాసరి లింగమల్లు,మారబోయిన రాము యాదవ్,మద్దె బోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు న్యాయం చెయ్యాలని గట్టుపల్ తాహాసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేత



గట్టుపల్,ఫిబ్రవరి 17(ప్రజాక్షేత్రం):
గట్టుపల మండలం అంతపేట గ్రామ పంచాయతీలోని సోమరాజు గూడ రంగం తండా రైతులు సర్వేనెంబర్ 280 సర్వే నెంబర్లు 50 మంది రైతులు గత 50 సంవత్సరాలుగా భూమి సాగు చేసుకుని బతుకుతున్నారు. పట్టా భూమి కలిగియున్నారు. సర్వే నెంబరు మిస్సింగ్ వల్ల 50 మంది రైతులకు రైతు భరోసా నిలిపివేయడం జరిగింది.ఇట్టి సర్వే నెంబర్ల పై సమగ్ర విచారణ జరిపి 50 మంది రైతులకు న్యాయం చేసి, రైతు భరోసా ఇప్పించాలని ఈరోజు గట్టుపల్ తహసిల్దార్ కార్యాలయంలో ఆర్ ఐ సురేష్ కుమార్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రాచమల్ల వెంకట్ రెడ్డి,వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి కర్నాటి సుధాకర్, తల్పూరు సైదులు,రైతులు శీను నాయక్,జాను నాయక్, లక్ష్మానాయక్,రాజేష్ నాయక్, శుక్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఇన్చార్జిల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహణ



మాక్లూర్,ఫిబ్రవరి 17 (ప్రజాక్షేత్రం):
మాక్లూర్ మండలంలో,మండల అధ్యక్షురాలు మమత రాజేశ్వర్ అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాలలో భాగంగా మండల ఇన్చార్జిల సమావేశం ఘనంగా జరిగింది.ఇట్టి సమావేశంలో మండలంలోని ఇన్చార్జి లకు టీచర్స్,పట్టభద్రుల ఎమ్మెల్సీ దిశా దశను నిర్దేశిస్తూ కూలంకషంగా చర్చ జరిగింది.తమ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఉపాధ్యాయులకు పట్టభద్రులకు విన్నవించడం జరిగింది. గతంలో ఎన్నికైన ఎమ్మెల్సీ అభ్యర్థులు పట్టభద్రులకు గాని ఉపాధ్యాయులకు గాని ఎలాంటి సహాయ సహకారాలు అందించలేదు.కావున బిజెపి నుండి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న మల్కా కొమరయ్య గారికి పట్టభద్రుల స్థానానికి పోటీ చేస్తున్నటువంటి అంజి రెడ్డి గారికి తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని బిజెపి శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి టీచర్స్ ఎమ్మెల్సీ జిల్లా కన్వీనర్ డాక్టర్ కొండ ఆశన్న గారు, ముఖ్య అతిథిగా డాక్టర్ విశ్వ ప్రకాష్ బాబు, కల్లిగొట్ గంగన్న,గంగోని సంతోష్,ముప్పెడి గంగన్న,రామావత్ సురేష్ నాయక్,గంగోని వినోద్,చింత ప్రవీణ్ రెడ్డి, దేదావత్ రమేష్ నాయక్,రాథోడ్ రాజశేఖర్,రాజేందర్ రెడ్డి, బోబిల్లి రమేష్,నర్సింగ్ రావ్,ధర్మపతి, ప్రణీత్,అనిల్,హన్మ గౌడ్, శివకుమార్, మహేష్,కళ్యాణ్ పాల్గొన్నారు.

## వలిగొండ లో ఘనంగా కెసిఆర్ జన్మదిన వేడుకలు

వలిగొండ,ఫిబ్రవరి 17 (ప్రజాక్షేత్రం):
భువనగిరిజిల్లా,వలిగొండ మండలంలో,బారాస అధినేత కేసిఆర్ జన్మదిన వేడుకలు వలిగొండ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. తుమ్మల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధించడంతోపాటు రూపు రేఖలు మార్చేసిన ఘనత కెసిఆర్ కే దక్కిందన్నారు, మాజీ జడ్పిటిసి మొగిళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ మార్గదర్శి జాతిపిత కెసిఆర్ అని అన్నారు.తెలంగాణ ఉన్నంతకాలం ఆయన చేపట్టిన కార్యక్రమాలు చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తుమ్మల వెంకటరెడ్డి మొగిల శ్రీనివాస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను అందజేసిన ఎన్ఎండి ఫిరోజ్



**నంద్యాల,ఫిబ్రవరి 17 (ప్రజాక్షేత్రం):**
ఒంగోలు లోని పి వి ఆర్ గ్రౌండ్స్ లో ఆదివారం నిర్వహించిన ప్రకాశం బాలోత్సవము ద్వితీయ పిల్లల పండుగ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి సుమారు 5 వేల మంది విద్యార్థులు తమ నైపుణ్యాలను కనబరిచేందుకు పోటీ పడ్డారు. ఈ పోటీల్లో స్ప్రింగ్ బోర్డు స్కూలు మరియు ఇండో హై స్కూల్ విద్యార్థులు వివిధ విభాగాలలో పాల్గొని బహుమతులు గెలుపొందారు.
ఎస్సే రైటింగ్ మరియు స్పెల్ బీ పోటీల్లో అస్మా తబస్సుం మొదటి బహుమతి గెలుపొందగా,మెమరీ టెస్ట్ పోటీల్లో జహియ అంజుం, ఈనోష్ మరియు మాన్విత్ కార్తీ ద్వితీయ బహుమతి గెలుపొందారు. విజేతలను అభినందించడానికి నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు టీడీపీ రాష్ట్ర యువనాయకులు శ్రీ ఎన్ఎండి ఫిరోజ్ హాజరై విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ పిల్లలు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని, గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ప్రతీ పోటీలలో పాల్గొనాలని, తల్లిదండ్రులకు మరియు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని,పిల్లలు మొబైల్ ఫోన్ వాడకం తగ్గించి బాగా చదివి రాబోయే పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని అన్నారు.పాఠశాల కరస్పాండెంట్ డా. జె. వి. నారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు బహుమతులు అందించి వారిని ప్రోత్సహించడానికి విచ్చేసిన ఎన్ఎండి ఫిరోజ్ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. వచ్చే సంవత్సరం మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చైతన్య,ప్రిన్సిపల్ శ్వేత, విద్యార్థినీ విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులు ఇక ఉద్యమాలకు సిద్ధం కావాలి


- జర్నలిస్టులకు కేటాయించిన భూమిని ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేయాలి
- ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు

**గుద్దేటి రమేష్ బాబు డిమాండ్**




**ఖమ్మం,ఫిబ్రవరి 17(ప్రజాక్షేత్రం):**
ఖమ్మం జర్నలిస్టులకు కేటాయించిన 23 ఎకరాల స్థలాన్ని తక్షణమే జర్నలిస్టులకు అప్పగించి స్థలాలను పంపిణీ చేయాలని, అందుకు అవసరమైన కార్యాచరణను వేగవంతం చేయాలని ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు అధికారులను డిమాండ్ చేశారు.ఖమ్మం ప్రెస్ క్లబ్ లో సోమవారం జరిగిన జర్నలిస్టుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత మూడు దశాబ్దాలుగా జర్నలిస్టులు సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్నారని, గత సర్కార్ జర్నలిస్టులకు 23.2 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ క్యాబినెట్ తీర్మానం చేసి జీవోను విడుదల చేసిందని, కానీ రోజురోజుకు జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే జర్నలిస్టులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం హౌసింగ్ సొసైటీ కి తక్షణమే భూమిని అప్పగించి జర్నలిస్టులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు మూడు జర్నలిస్ట్ యూనియన్లు, హౌసింగ్ కమిటీ,ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీతో సమన్వయంగా వ్యవహరించి సమస్య పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని సూచించారు.సభ్యత్వాలు రాని జర్నలిస్టులకు తక్షణమే సభ్యత్వాలు ఇవ్వాలని, ఇళ్ల స్థలాల సాధన కోసం ఇకపై దశల వారి ఆందోళనలు నిర్వహించాలని,అందుకు అవసరమైన జేఏసీ ని ఏర్పాటు చేయాలని కోరారు. దశలవారి ఉద్యమం లో జర్నలిస్టులు,డెస్క్ జర్నలిస్టులు,వీడియో గ్రాఫర్లు, ఫోటోగ్రాఫర్లు,పలు విభాగాలకు చెందిన జర్నలిస్టు మిత్రులు పాల్గొని ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని,అందుకు అవసరమైన చొరవ మూడు యూనియన్లు,హౌసింగ్ కమిటీ తీసుకోవాలని సూచించారు. ఖమ్మం జర్నలిస్టులకు కేటాయించిన 23 ఎకరాల భూమిని జర్నలిస్టులకు అప్పగించే అంశంలో తీవ్ర నిర్లక్ష్యం వైఖరికి నిరసనగా జర్నలిస్టులు చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టి జె ఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి అమరవరపు కోటేశ్వరరావు, సీనియర్ డెస్క్ జర్నలిస్టులు నారాయణ రావు,ప్రసాద్ రావు,జిల్లా ఉపాధ్యక్షులు చక్రవర్తి,ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ కే జానీ పాషా,ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు,కోశాధికారి బిక్కి గోపి,సహాయ కార్యదర్శులు మూల జీవన్ రెడ్డి,మేడి రమేష్,ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్,సూర్య బ్యూరో సత్యనారాయణ, మహిళ ప్రతినిధులు వంగూరి ఈశ్వరి,రోజా,శ్రీదేవి,జర్నలిస్ట నాయకులు సంతోష్,అంతోటి శ్రీనివాస్,పానకాలరావు, తిరుపతి రావు,గోవింద్, వెంకటరెడ్డి,హుస్సేన్, వెంకటాద్రి,నాగేష్,గణేష్, సూర్య,శ్రీధర్,నాగేశ్వరరావు, శ్రీనివాస్,ఉపేందర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# స్వామివారికి చక్రస్నానం కార్యక్రమం నిర్వహణ



**మాక్లూర్,ఫిబ్రవరి 17(ప్రజాక్షేత్రం):**
త్రయోదశ 13 వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ అపురూప వెంకటేశ్వర స్వామి ఆలయంలో చివరి రోజు సోమవారం ఉదయం 9 నుండి సాయంత్రం 6 గంటల మధ్య నిత్య వీధి యాగశాలలో సుదర్శన నరసింహ మహా హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారికి చక్రస్నానం కార్యక్రమం నిర్వహించారు.ఇందులో భాగంగా ఉదయం :మహా పూర్ణహుతి శ్రీవారికి అవభ్రదము చక్రతీర్థం కుంభ పోషణ సాయంత్రం: దేవతో ధ్వసనము శ్రీ పుష్ప యాగము ద్వదశ దాన సప్త వరణము ఉత్సవ సమాప్తి కార్యక్రమాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సేవా కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అమృత లతా రెడ్డి,వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, కమిటీ సభ్యులు ప్రభాదేవి,రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి,అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


# తెలంగాణా ఆత్మ గౌరవం కే.సి.ఆర్ - గుండాల కృష్ణ

- యస్.బి.ఐ.టి. లో మొక్కలు నాటి ఉద్యమ నేత జన్మదిన వేడుకలు



**ఖమ్మం,ఫిబ్రవరి 17(ప్రజాక్షేత్రం):**
మలిదశ తెలంగాణా ఉద్యమ నేత, రాష్ట్ర ఆత్మగౌరవానికి ప్రతీక అయిన మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్రావు జన్మదినం సందర్భంగా స్థానిక యస్.బి.ఐ.టి. కళాశాల విద్యార్థుల సమక్షంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు.రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలను ఏకతాటిపై నిలిపి అసాధ్యమనుకున్న రాష్ట్ర సాధనను సుసాధ్యం చేసిన కే.సి.ఆర్. మరిన్ని జన్మదినాలు జరుపుకోవాలని కృష్ణ కోరారు. తన ప్రాణాలను సైతం లెక్కించక సాధించిన తెలంగాణా రాష్ట్రం దేశ రాజకీయాలలో పెను మార్పులు తీసుకువచ్చిందని వారు గుర్తు చేసారు. కే.సి.ఆర్. పాలనా కాలం రాష్ట్ర నిర్మాణంలో సువర్ణక్షరాలతో లిఖించదగినదని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా? జి. ధాత్రి తెలిపారు. రైతులు,విద్యార్థులు మరియు మహిళలు కే.సి.ఆర్. పాలనలో బంగారు తెలంగాణాకు సాక్షులు అని కళాశాల ప్రిన్సిపల్ డా? జి. రాజ్ కుమార్ తెలిపారు. అనంతరం కళాశాల ఆవరణలో జరిగిన జన్మదిన వేడుకలలో విద్యార్థులు, అధ్యాపకుల సమక్షంలో మొక్కలు నాటి,కేక్ కట్ చేసి కే.సి.ఆర్. పై అభిమానాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్,గంధం శ్రీనివాసరావు,డా.ఎ.వి.వి. శివ ప్రసాద్,డా.జె. రవీంద్రబాబు, డా. యస్. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు..!




**బంటారం ఫిబ్రవరి 17(ప్రజాక్షేత్రం):**
తెలంగాణ ఉద్యమకారుడు బి ఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు, జన్మదిన వేడుకలు బంటారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. బి ఆర్ఎస్ శ్రేణులు పలు చోట్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసారు, భారీ కేకు కట్ చేసి స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి అల్లాపూరం శ్రీనివాస్ మాట్లాడుతూ పేద ప్రజల పెద్ద కొడుకు లాంటి కెసిఆర్ ను కాదనుకొని తప్పు చేశామని ప్రజలు బాధపడుతున్నారని, స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


# మాజీ ఎమ్మెల్యే పెద్ది ఆధ్వర్యంలో ఘనంగా కెసిఆర్ జన్మదిన వేడుకలు



**నర్సంపేట,ఫిబ్రవరి 17(ప్రజాక్షేత్రం):**
తెలంగాణ రాష్ట్ర స్వయం పాలకుడు,తెలంగాణ సాధకుడు,మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదినం సందర్భంగా నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి సమక్షంలో మొక్కలు నాటి,ఎస్టి హాస్టల్ విద్యార్థులతో కేక్ కట్ చేసి కెసిఆర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.. అనంతరం నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేయడం జరిగింది .. బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ యూత్ కన్వీనర్ శానబోయిన రాజకుమార్ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన నర్సంపేట పట్టణ బిఆర్ఎస్వి అధ్యక్షులు దేవోజు హేమంత్.. ఇట్టి కార్యక్రమంలో నర్సంపేట నియోజవర్గ బిఆర్ఎస్వి కన్వీనర్ సదిరం వినయ్,నర్సంపేట పట్టణం బిఆర్ఎస్వి అధ్యక్షులు దేవోజు హేమంత్, బిఆర్ఎస్ నాయకులు బోడ మురళి నాయక్,కొండి మణికంఠ,ఎండి. బోలె పాషా,బానోత్ సురేష్,మోర్ వెంకన్న,బోడ సురేష్,లవన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన లబ్ధిదారుల ఎంపిక త్వరగా చేపట్టండి.

-బిజెపి జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు.



**వనపర్తి ఫిబ్రవరి 17 ప్రజాక్షేత్రం:**
ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన లబ్ధిదారుల ఎంపికను త్వరగా చేపట్టాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా ఐడిఓసి కార్యాలయంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటేశ్వర్లు ను కలిసి ప్రజావాణిలో విజ్ఞప్తి చేశారు. దేశంలో కార్పోరేట్ వ్యవస్థ ధాటికి ప్రాబల్యం కోల్పోతున్న 18 గ్రామీణ చేతి వృత్తులకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన తో దళారీ వ్యవస్థకు అవకాశం లేకుండా ఆన్లైన్ దరఖాస్తులను స్థానిక సంస్థల ద్వారా గుర్తించి లబ్ధి పొందే విధంగా చర్యలు చేపట్టిందన్నారు. చేతివృత్తుల వారికి శిక్షణ సమయంలో రోజుకు 500 అలాగే గౌరవ వేతనం కింద 15000 టూల్ కిట్ సర్టిఫికెట్ అందజేసి బ్యాంకుల ద్వారా 18 నెలల వ్యవధిలో లక్ష రూపాయలు రెండవ దశలో 30 నెలల వ్యవధితో మూడు లక్షలు ఇప్పించే విధంగా విశ్వకర్మ యోజనలో లబ్ధి పొందేందుకు అవకాశం కల్పించారని తెలిపారు. సంబంధిత శాఖల సమన్వయ లోపంతో శిక్షణకు తీవ్ర జాప్యం జరుగుతోందని వెంటనే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకునే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులు తిరుపతయ్య మోడల్ శ్రీనివాసులు వడ్డే వెంకటయ్య రామకృష్ణ పెద్ది రమేష్ కోటి కురుమయ్య వెంకటేష్ యాదగిరి వీరేష్ బోయరాజు కొమ్ము మాసయ్య పడాకుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకు చేరుకున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బ్యాలెట్ పత్రాలు



**విశాఖపట్టణం,ఫిబ్రవరి 17(ప్రజాక్షేత్రం):**
ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానంలో ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ పత్రాలు జిల్లాకు చేరుకున్నాయి. ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు, పోటీ చేసే అభ్యర్థుల ఫోటోలు, ఇతర వివరాలతో కూడిన నివేదికలను స్థానిక అధికారులు ఇప్పటికే పింపించారు. ఆ మేరకు సంబంధిత బ్యాలెట్ పత్రాలను కర్నూలులో ప్రింటింగ్ చేశారు. అక్కడి నుంచి వాటిని ప్రత్యేక వాహనంలో విశాఖపట్టణం కలెక్టరేట్ కు సోమవారం తీసుకొచ్చారు. పది శాతం రిజర్వ్ తో కలిపి, జిల్లాలోని పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్యకు సరిపడా సంబంధిత పత్రాలను స్థానిక అధికారులు సేకరించి భద్రపరిచారు. ఏఆర్వో, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్ ఈ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం సంబంధిత వాహనానికి పోలీసులు,ఇతర లైజనింగ్ అధికారుల సమక్షంలో సీలు వేసి ఉత్తరాంధ్ర జిల్లాలకు పంపించేశారు.

# పెద్దగట్టును దర్శించుకున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి..

- ఘన స్వాగతం పలికిన ఆలయ కమిటీ సభ్యులు నాయకులు.



**సూర్యాపేట(చివ్వేంల), ఫిబ్రవరి 17(ప్రజాక్షేత్రం):దూరజ్‌పల్లి లోని పెద్దగట్టు(గొల్లగట్టు)** శ్రీ లింగమంతుల స్వామి వారిని రాష్ట్ర నీటి పారుదల ఆయకట్టు అభివృద్ధి,ఆహార %ఢ% పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా మంత్రికి ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు.ఆలయ ప్రాంగణంలో భక్తులతో కలిసి బేరి కొట్టడం జరిగింది. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడుతూ పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర కోసం ప్రభుత్వం ఐదు కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు ప్రత్యేక చొరచూపాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాం రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,వేణారెడ్డి, ఆలయ చైర్మన్ నరసయ్య యాదవ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర యువ క్రాంతి బునియాధ్ ట్రైనింగ్ క్యాంప్ కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర మినిస్టర్ పొన్నం ప్రభాకర్ గౌడ్

**రాజేంద్రనగర్,మహేశ్వరం ఫిబ్రవరి 17(ప్రజాక్షేత్రం):**



తెలంగాణ రాష్ట్ర యువ క్రాంతి బునియాధ్ ట్రైనింగ్ క్యాంప్ కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర మినిస్టర్ పొన్నం ప్రభాకర్ గౌడ్ కి ఘన స్వాగతం పలికిన మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచెన్న లక్ష్మారెడ్డి, టీపీసీసీ సభ్యులు భాస్కర్ రెడ్డి మరియు, బొక్క జంగారెడ్డి, కృష్ణ నాయక్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య,రాజరాజేశ్వరి దేవాలయం చైర్మన్ అల్లే కుమార్, మంత్రి బాలరాజ్, ప్రశాంత్ రెడ్డి,లాజర్,శివ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనారు.

# కెసిఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపినజిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విట్టల్ రావు

**మాక్లూర్,ఫిబ్రవరి 17(ప్రజాక్షేత్రం):**
నిజామాబాద్ జడ్పీ మాజీ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు సోమవారం బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ నివాసం కు వెళ్లి 71వ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు.వీరితోపాటు రామ కిషన్ రావు, సత్యనారాయణ రావు,డి సందీప్ కుమార్ కెసిఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.






ప్రజా క్షేత్రం
మంగళవారం 18- 02 - 2025



## సాయిపల్లవికి ముద్దు పెట్టిన అభిమాని.. బాషా రేంజ్ ఎలివేషన్

కథానాయిక సాయిపల్లవి ఎంచుకునే కథలు వేటికవే విభిన్నంగా ఉంటాయి. ఏవి పడితే అవి చేసుకుంటూ పోకుండా ప్రాధాన్యమున్న పాత్రల్ని మాత్రమే చేసుకుంటూ వస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల తండేల్ సినిమా చేసింది. ఇందులో మరోసారి తన నటనతో కట్టిపడేసింది. ఇప్పటికే ఈ మూవీ వంద కోట్ల క్లబ్‌లో చేరింది.

సెల్ఫీ దిగాక..

ఇకపోతే తండేల్ ప్రమోషన్స్‌లో భాగంగా నిర్వహించిన ఓ ఈవెంట్‌లో జరిగిన చిన్న సంఘటనకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విడుదలకు ముందు జరిగిన తండేల్ జాతర ఈవెంట్‌లో ఓ మహిళా అభిమాని ఎలాగోలా సాయిపల్లవిని చేరుకుంది. తనతో సెల్ఫీ దిగిన అమ్మాయి హీరోయిన్ షేక్‌హ్యాండ్ ఇచ్చింది. దీంతో తెగ సంతోషపడిపోయిన ఆమె సాయిపల్లవి చేతికి ముద్దు పెట్టింది. ఈ వీడియో ఆలస్యంగా వెలుగులోకి రాగా సోషల్ మీడియాలో వైరలవుతోంది. బాషా సినిమాలో రజనీకాంత్ మాణిక్ బాషాగా మారిన సమయంలో తన అనుచరులంతా కూడా ఆయన చేతిని ముద్దాడుతుంటారు. ఆ సీన్‌తో సాయిపల్లవి క్లిప్‌ను పోలుస్తూ బుజ్జితల్లికి బాషా రేంజ్ ఎలివేషన్ ఇస్తున్నారు. ఇకపోతే సాయిపల్లవి ప్రస్తుతం రామాయణ సినిమాలో నటిస్తోంది. ఇందులో రణ్‌బీర్ కపూర్ హీరోగా నటిస్తున్నాడు.

## ఛావా' సినిమా చూసి కన్నీళ్లతో ప్రేక్షకులు

బాలీవుడ్ హీరో విక్కీ కౌశల్ రష్మిక జోడీగా నటించిన చిత్రం 'ఛావా'.. ఛత్రపతి శివాజీ మహరాజ్ కుమారుడు శంభాజీ మహరాజ్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇందులో ఆయన భార్యగా, మహారాణి యేసుబాయిగా రష్మిక మందన్న నటించారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించారు. ఫిబ్రవరి 14న విడుదలైన ఈ మూవీ కేవలం రెండు రోజుల్లోనే రూ. 86 కోట్లు రాబట్టింది. 1689 సమయంలో మొఘల్ చక్రవర్తి ఔరం గజేబు మరాఠా సామ్రాజ్యంపై దండెత్తిన సమయంలో తమ రాజ్యాన్ని కాపాడుకోవడానికి వారు చూపిన ధైర్యసాహసాలను కళ్ళకు కట్టినట్లు దర్శకుడు చూపారు. ముఖ్యంగా క్లైమాక్స్ సీన్స్ చూసిన ప్రేక్షకుల కంటతడి పెట్టుకుంటున్నారు. చాలా ఎమోషనల్‌గా తమ అభిప్రాయాన్ని సోషల్‌మీడియా వేదికగా పంచుకుంటున్నారు. మూవీ చూసిన వారిలో ఎక్కువ భాగం కన్నీళ్లతోనే బయటకు వస్తున్నారు. థియేటర్‌లోనే శంభాజీ మహరాజ్‌ను గుర్తు చేసుకుంటూ కేకలు వేస్తూ తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. అందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.





## బిగ్గెస్ట్ మైల్‌స్టోన్ చేరుకున్న 'తండేల్'.. నాగచైతన్యకు ఫస్ట్ సినిమా

తండేల్ సినిమా మరో అరుదైన విజయాన్ని సొంతం చేసుకుంది. ఇండియన్ బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్స్‌తో రికార్డ్ క్రియేట్ చేసింది. నాగచైతన్య, సాయిపల్లవి నటించిన ఈ చిత్రాన్ని చందు మొండేటి తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్ పతాకంపై బన్నీ వాసు నిర్మించారు. ముఖ్యంగా దేవీశ్రీ ప్రసాద్ సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని సాధించిన తండేల్ సినిమా 100 కోట్ల క్లబ్‌లో చేరింది. నాగ చైతన్య కెరీర్‌లో వంద కోట్ల మొదటి చిత్రంగా నిలిచింది. తండేల్ సినిమా కేవలం 10 రోజుల్లోనే రూ. 100 కోట్ల గ్రాస్ దాటింది. ఇదే విషయాన్ని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఫిబ్రవరి 7న థియేటర్లలో రిలీజ్ అయిన తండేల్.. మొదటి రోజు నుంచే కలెక్షన్ల స్పీడ్ చూపింది. ఈ చిత్రం %ఎణ% వెర్షన్ సినిమా విడుదలైన మొదటి రోజే లీక్ అయింది. పైరసీ ఆందోళనలు పెద్ద ఎత్తున తలెత్తాయి. అయితే అలాంటి అవాంతరాలని కూడా దాటుకొని వందకోట్ల క్లబ్‌లో చేరడం మామూలు విషయం కాదు. ఓవర్సీస్‌లో 1 మిలియన్ దాటింది. ఈ చిత్రం డొమస్టిక్ మార్కెట్లో అద్భుతంగా రాణించడమే కాకుండా, తెలుగు రాష్ట్రాల్లోని డిస్ట్రిబ్యూటర్స్‌కు లాభదాయకమైన వెంచర్ అయ్యింది. ఇప్పటికే బ్రేక్‌ఈవెన్ అయి లాభాలు తెచ్చిపెట్టింది. పద్నాలుగు నెలలు పాకిస్తాన్ జైలులో మగ్గిపోయిన 22 మంది మత్స్యకారుల వలస జీవితం ఇతివృత్తంగా తెరకెక్కించిన 'తండేల్' చిత్రానికి ప్రేక్షకులు క్యూ కట్టేశారు.. శ్రీకాకుళం,విజయనగరం , తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన మత్స్యకారులు పాక్ నుంచి ఎలా విడుదలయ్యారనే అంశాన్ని ఉన్నది ఉన్నట్లు సినిమాలో చూపలేదని వారు వాపోయిన విషయం తెలిసిందే.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at M R P Publications, #6-3-1880,Vanasthalipuram,Ranga Reddy(Dist),Hyderabad, Telangana 500070. Published at H.NO. 2-50, Shankar palli, Ranga Reddy, Hyderabad, Telangana 501203. Editor : K PRAVEEN KUMAR. Phone number 9177920459 , email : prajakshetram1@gmail.com , https://prajakshetram.in , RNI NO. TELTEL/12330